# కబళిస్తున్న క్యాన్సర్

## దేశంలో క్యాన్సర్ బారిన పడిన ప్రతి ఐదుగురిలో ముగ్గురి మృతి

- చైనా తర్వాత భారతదేశంలోనే అత్యధిక రోగుల మరణాలు
- ప్రపంచవ్యాప్తంగా చూస్తే భారత్‌లోనే 10 శాతం చావులు
- ది లాన్సెట్ రీజినల్ హెల్త్ సౌత్ ఈస్ట్ ఆసియా జర్నల్ వెల్లడి



ఢిల్లీ, ఫిబ్రవరి 24: భారత్‌లో క్యాన్సర్ కోరలు చాస్తున్నది. ఈ మహమ్మారి బారినపడిన ప్రతి ఐదుగురిలో ముగ్గురు మృత్యువాత పడుతున్నారు. అదే సమయంలో అమెరికాలో ప్రతి నలుగురిలో ఒకరు మరణిస్తుండగా.. చైనా అత్యధికంగా ప్రతి ఇద్దరిలో ఒకరు మృత్యువాత పడుతున్నారు. ఈ మేరకు 'ది లాన్సెట్ రీజినల్ హెల్త్ సౌత్ ఈస్ట్ ఆసియా' జర్నల్‌లో అధ్యయన వివరాలు ప్రచురితమయ్యాయి. ఐసీఎంఆర్ అధ్యయనం ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ కేసుల్లో భారత్ మూడో స్థానంలో ఉంది. కేసుల పరంగా చైనా, అమెరికా వరుసగా తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. ప్రపంచవ్యాప్తంగా చూసుకుంటే చైనా తర్వాత భారత్‌లో అత్యధికంగా 10 శాతం మరణాలు సంభవిస్తున్నాయి. భారత్‌లో పురుషులతో పోలిస్తే మహిళలు ఎక్కువగా క్యాన్సర్ బారిన పడుతుండటం, మహిళలే అత్యధికంగా మరణిస్తుండటం గమనార్హం. భారత్‌లో జనాభా పెరిగేకొద్దీ ఏటా 2 శాతం కేసుల పెరుగుదల నమోదవుతున్నదని, కాబట్టి రాబోయే రెండు దశాబ్దాలు భారత్‌కు సవాళ్లు తప్పవని పరిశోధకులు తెలిపారు. ఈ నేపథ్యంలో క్యాన్సర్ నివారణపై దృష్టిసారించాల్సిన అవసరాన్ని ఈ అధ్యయనం నొక్కిచెప్తున్నది.

భారత్‌లో నమోదవుతున్న మొత్తం క్యాన్సర్ రకాలు ▶ 36 | ఏటా కేసుల పెరుగుదల 2%

### క్యాన్సర్ కేసుల్లో మొదటి మూడు దేశాలు

చైనా ▪ అమెరికా ▪ భారత్

మరణాల పరంగా ▶ 1st: చైనా, 2nd: భారత్ (10%)

| మహిళల్లో కొత్త కేసులు | | మహిళల్లో మరణాలు | | పురుషుల్లో కొత్త కేసులు | |
|---|---|---|---|---|---|
| రొమ్ము క్యాన్సర్ | 30% | రొమ్ము క్యాన్సర్ | 24% | నోటి క్యాన్సర్ | 16% |
| గర్భాశయ క్యాన్సర్ | 19% | గర్భాశయ క్యాన్సర్ | 20% | ఊపిరితిత్తులు 8.6% | అన్నవాహిక 6.7% |

మహిళలు, పురుషులపై ఎక్కువగా ప్రభావం చూపుతున్న ఐదు రకాల క్యాన్సర్లు: రొమ్ము క్యాన్సర్, గర్భాశయ, నోటి, ఊపిరితిత్తులు, అన్నవాహిక

మొత్తం క్యాన్సర్ కేసుల్లో వీటి వాటా 44%



**వయసుల వారీగా..**

- 70 ఏండ్లు లేదా అంతకంటే ఎక్కువ వయసు ఉన్నవారు భారత్‌లో ఎక్కువగా క్యాన్సర్ బారిన పడుతున్నారు.
- రీప్రొడక్టివ్ ఏజ్ గ్రూప్ (15-49) వారు కేసుల పరంగా ఆ తర్వాతి స్థానంలో ఉన్నారు.
- మధ్యస్థ వయస్సు, వృద్ధులు 8-10 శాతం ఎక్కువగా క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉంది. మరణాల రేటు 5.5-7.7 శాతం అవకాశం ఉంది. దేశంలో మధ్యస్థ, వృద్ధ వయసు లవారు అత్యధికంగా 70 శాతం మృత్యువాత పడుతుండటం ఆందోళనకరం.



## పీఎం కిసాన్ నిధుల విడుదల

**రైతుల ఖాతాల్లో 22 వేల కోట్లు జమ: కేంద్రం**

న్యూఢిల్లీ: ప్రధాన్‌మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో భాగంగా 19వ విడత నిధులను ప్రధాని మోదీ సోమవారం విడుదల చేశారు. దేశవ్యాప్తంగా 9.8 కోట్లమంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.22 వేల కోట్లకుపైగా నిధులు జమ చేసినట్టు కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. 'అన్నదాతలు దేశానికి గర్వకారణం. వారి జీవన ప్రమాణాలు మెరుగుపర్చాలన్న ఆశయానికి కట్టుబడి ఉన్నాం' అంటూ మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. బీహార్‌లోని భాగల్‌పూర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నిధులను విడుదల చేశారు.

## మైనింగ్‌కు వ్యతిరేకంగా గాలి నిరసన!

- కర్ణాటకలోని కొప్పల్‌లో ఆందోళనలో పాల్గొన్న బీజేపీ నేత
- అక్రమ మైనింగ్ కేసుల్లో జనార్దన్‌రెడ్డి ప్రధాన నిందితుడు



బెంగళూరు: మైనింగ్ దిగ్గజంగా పేరొందిన కర్ణాటక ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు గాలి జనార్దన్ రెడ్డి కొప్పల్‌లో మైనింగ్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపినట్టు తెలుస్తోంది. కర్ణాటకలోని కొప్పల్ పట్టణంలో మైనింగ్‌కు వ్యతిరేకంగా ఒక నిరసన ప్రదర్శనకు గాలి జనార్దన్ రెడ్డి నాయకత్వం వహించినట్టు ఓ పత్రికా విలేకరి ఎక్స్‌లో వెల్లడించారు. గాలి జనార్దన్ రెడ్డితోపాటు స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే రాఘవేంద్ర హిత్నల్ కూడా ఈ నిరసనలో పాల్గొన్నారని ఆ విలేకరి ఫొటోలతో సహా షేర్ చేశారు. మాజీ మంత్రి గాలి జనార్దన్ రెడ్డి కోట్లాది రూపాయల మైనింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్నారు. బళ్లారిలో భారీ స్థాయిలో అక్రమ మైనింగ్ జరిగినట్లు కర్ణాటక లోకాయుక్త నిర్ధారించడంతో 2011లో జనార్దన్ రెడ్డిని సీబీఐ అరెస్టు చేసింది. విచారణను ముగించాలని ప్రత్యేక సీబీఐ కోర్టును సుప్రీంకోర్టు 2022 అక్టోబర్ 10న ఆదేశించినా 13 ఏండ్లకు పైగా ఈ కేసు ముందుకు సాగడం లేదు.

## ఈడీ దర్యాప్తును పక్కన పెట్టిన లోకాయుక్త

**కేవలం 30 ప్రశ్నలతో సిద్ధరామయ్యకు క్లీన్‌చిట్**

బెంగళూరు, ఫిబ్రవరి 24: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతి, ఇతరుల ప్రమేయం ఉన్నట్టు ఆరోపణలు వస్తున్న ముడా కుంభకోణంపై లోకాయుక్త దర్యాప్తు నివేదిక కీలక వివరాలను వెల్లడించింది. సిద్ధరామయ్యపై దర్యాప్తును ముగిస్తూ ఈ కేసులో "బీ నివేదిక"ను దాఖలు చేయడానికి ముందు లోకాయుక్త సిద్ధరామయ్యకు కేవలం 30 ప్రశ్నలు మాత్రమే సంధించింది. ఈ కేసును లోతుగా దర్యాప్తు చేసి కుంభకోణంలోని కీలక పాత్రధారులను బయటపెట్టిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దర్యాప్తును లోకాయుక్త పరిగణనలోకి తీసుకోకపోవడం గమనార్హం.

# యుద్ధానికి ముగింపు ఎప్పుడు?

- రష్యా-ఉక్రెయిన్ వార్‌కు మూడేండ్లు పూర్తి
- ఇరువైపులా లక్షా 50వేల మందికిపైగా మృతి
- లక్షల కోట్ల ఆస్తి నష్టం..ప్రపంచ దేశాలపైనా ప్రభావం
- అమెరికా వైఖరిలో మార్పుతో సందిగ్ధంలో ఉక్రెయిన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: రెండో ప్రపంచ యుద్ధం తర్వాత యూరప్‌లో జరుగుతున్న అత్యంత భీకర యుద్ధంగా మారిన రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమై సోమవారం నాటికి మూడేళ్లు పూర్తయ్యింది. ఈ యుద్ధం ఆ రెండు దేశాలనే కాక మిగిలిన ప్రపంచంపైన కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. ముగింపు ఎన్నడో తెలియని అనిశ్చిత వాతావరణంలో ఉభయ దేశాల నాయకులు తమ సైనికుల వీరత్వాన్ని ఈ సందర్భంగా కీర్తించారు. నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్(నాటో)లో చేరాలన్న ఉక్రెయిన్ ఆలోచనలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న రష్యా.. 2022 ఫిబ్రవరి 24న ఉక్రెయిన్‌ను ఆక్రమించుకునేందుకు ప్రత్యేక సైనిక చర్యకు దిగడంతో రెండు దేశాల మధ్య యుద్ధం మొదలైంది.

**భారీగా ఆస్తి, ప్రాణనష్టం**

సులభంగా ఉక్రెయిన్‌ను స్వాధీనం చేసుకోవచ్చనుకున్న రష్యాకు కీవ్ సేనల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురవుతున్నది. పశ్చిమ దేశాల నుంచి ఉక్రెయిన్‌కు అందుతున్న కోట్లాది డాలర్ల సాయం కారణంగా పుతిన్‌కు విజయం అంత తొందరగా దక్కడం సాధ్యం కాలేదు. ఉక్రెయిన్‌లోని ఐదింట ఒక వంతు భూభాగాన్ని రష్యా సేనలు ఆక్రమించుకోగా యుద్ధ భూమిలో రెండు వైపులా లక్షా 50 వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. లక్షల మంది నిరాశ్రయులయ్యారు. భారీగా ఆస్తినష్టం సంభవించింది. ఈ యుద్ధం ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీసింది. రష్యా దాడుల్లో అనేక భవనాలు, ఆనకట్టలు, రహదారులు, పాఠశాలలు, ఇతర మౌలిక వసతులు ధ్వంసమయ్యాయి. ఉక్రెయిన్ ద్రవ్యోల్బణం 12 శాతానికి, రష్యాలో 9.5 శాతానికి పెరిగింది. యుద్ధంలో రష్యా కూడా తీవ్రంగా నష్టపోయింది. పశ్చిమ దేశాల ఆంక్షలతో దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నది.



మార్చి 8, 2022న రష్యా దాడిలో ధ్వంసమైన ఖార్కీవ్‌లోని ఒక అపార్ట్‌మెంట్

**అమెరికా వైఖరిలో మార్పు..**


అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం యుద్ధం పట్ల అమెరికా వైఖరిలో వచ్చిన మార్పు ఉక్రెయిన్‌తోపాటు ఇతర యూరోపియన్ దేశాలను ఆందోళనకు గురిచేస్తోంది. గత అధ్యక్షుడు జో బైడెన్ ప్రభుత్వం ఉక్రెయిన్‌కు సైనిక, ఆర్థిక, మానవతా సహాయంగా 119 బిలియన్ డాలర్లకు పైగా సహాయాన్ని అందచేసింది. అయితే బైడెన్ మాదిరి ట్రంప్ నుంచి సహకారం ఉక్రెయిన్‌కు లభించే అవకాశం కనపడడం లేదు.

**సంపూర్ణ యుద్ధ ఖైదీల మార్పిడికి ప్రతిపాదన**

యుద్ధాన్ని ముగించే ప్రక్రియ ప్రారంభానికి ముందుగానే రష్యాతో యుద్ధ ఖైదీల సంపూర్ణ మార్పిడి పూర్తి కావాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సోమవారం ప్రతిపాదించారు. కీవ్‌లో జెలెన్‌స్కీ ప్రసంగిస్తూ, యుద్ధ ఖైదీలందరినీ విడుదల చేయడానికి ఉక్రెయిన్ సిద్ధంగా ఉందని ఆయన ప్రకటించారు. సంపూర్ణంగా యుద్ధ ఖైదీల విడుదల జరగాలని, రెండు దేశాలకూ వర్తించాలని ఆయన ప్రతిపాదించారు.

### రష్యా-ఉక్రెయిన్ యుద్ధం అంకెల్లో

- **152,295 మంది**– యుద్ధంలో మరణించిన రష్యన్లు, ఉక్రెయినియన్లు (సైనికులు, సాధారణ పౌరులు సహా)
- **10.6 మిలియన్లు**– నిరాశ్రయులైన ఉక్రెయినియన్లు
- **20 శాతం** – రష్యా ఆక్రమించుకున్న ఉక్రెయిన్ భూభాగం
- **25 ఏళ్లు**– ఉక్రెయిన్ సైన్యంలో తప్పనిసరిగా చేరవలసిన కనీస వయసు 27 ఏళ్ల నుంచి 25 ఏళ్లకు తగ్గింపు
- **65.9 బిలియన్ డాలర్లు** –ఉక్రెయిన్‌కు అమెరికా చేసిన సైనిక సాయం
- **279 బిలియన్ డాలర్లు** –ఉక్రెయిన్‌కు వివిధ దేశాల ప్రభుత్వాల నుంచి అందిన సాయం



**చాంపియన్స్ ట్రోఫీలో విదేశీయుల కిడ్నాప్‌కు ఐఎస్ కుట్ర**

ఇస్లామాబాద్: ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి హాజరయ్యే విదేశీయులను డబ్బు కోసం కిడ్నాప్ చేసేందుకు ఇస్లామిక్ స్టేట్ ఖోరసన్ ప్రావిన్స్(ఐఎస్‌కేపీ) కుట్ర పన్నుతున్నట్టు పాక్ నిఘా విభాగం(ఐబీ) హెచ్చరిక జారీ చేసింది. ఎయిర్‌పోర్టులు, రేవులు, కార్యాలయాలు, నివాస ప్రాంతాలలో నిఘా వేస్తూ చైనా, అరబ్ దేశాల నుంచి వచ్చే విదేశీయులను లక్ష్యంగా చేసుకోవాలని ఈ ఉగ్రవాద సంస్థ కుట్ర పన్నినట్టు హెచ్చరించింది. నగర శివార్లలో నిఘా కెమెరాలు లేని సురక్షితమైన ఇళ్లను అద్దెకు తీసుకోవాలని ఐఎస్‌కేపీ పథకం వేసినట్టు ఐబీ నివేదికలు వెల్లడించాయి. రిక్షాలు లేదా మోటారు సైకిళ్లకు మాత్రమే అందుబాటులో ఉండే ఇళ్లను అద్దెకు తీసుకుని వాటిలో అపహరించిన విదేశీ సందర్శకులను నిర్బంధించాలని ఐఎస్‌కేపీ యోచిస్తున్నట్టు పేర్కొన్నాయి.



**2 వేల మంది యూఎస్ ఎయిడ్ ఉద్యోగులపై వేటు**

వాషింగ్టన్: యూఎస్ ఎయిడ్‌లో 2 వేల మంది ఉద్యోగులను తొలగించాలని నిర్ణయించినట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం ప్రకటించారు. ఇదే సమయంలో మరికొందరిని చెల్లింపు సెలవుల కింద ఇంటికి పంపాలని నిర్ణయించారు. ఈ నిర్ణయాన్ని యూఎస్ ఎయిడ్ ఉద్యోగులకు ఒక నోటీస్ ద్వారా, ఆన్‌లైన్ ద్వారా తెలియజేశారు. 'ఆదివారం అర్ధరాత్రి 11.59 వరకు ముఖ్యమైన బాధ్యతల్లో ఉన్నవారు తప్ప ప్రపంచవ్యాప్తంగా ఉన్న మిగతా యూఎస్ ఎయిడ్ ఉద్యోగులందరినీ పరిపాలన పరమైన సెలవులో ఇంటికి పంపిస్తున్నాం' అని నోటీస్‌లో పేర్కొన్నారు. ఈ నిర్ణయం 2 వేల మంది ఉద్యోగులపై ప్రభావం చూపుతుందని ఆ నోటీస్ పేర్కొంది. ఉద్యోగుల తొలగింపునకు కోర్ట్ అనుమతించాకే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు.



### ఇంటర్నెట్ షట్‌డౌన్లలో భారత్ నెం.2

అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకొనే భారత్‌లోనే అత్యధిక సార్లు ఇంటర్నెట్ షట్‌డౌన్ విధించారు. తాజా ర్యాంకింగ్స్‌లో మన దేశం రెండో స్థానంలో ఉండగా, సైనిక పాలనలో ఉన్న మయన్మార్ రెండో స్థానంలో ఉన్నది.

ఇక ప్రజాస్వామ్య దేశాల పరంగా చూస్తే భారత్ మొదటి స్థానంలో ఉన్నది. 2023లో మన దేశంలో విధించిన 113 షట్ డౌన్లతో పోలిస్తే నిరుడు వాటి సంఖ్య తగ్గినప్పటికీ పరిస్థితి ఆందోళనకరంగానే ఉందని నివేదిక వెల్లడించింది.

2018 నుంచి 2023 వరకు ఈ ర్యాకింగ్స్‌లో మన దేశం మొదటి స్థానంలో నిలవడం గమనార్హం.

**గత ఏడాది ఇంటర్నెట్ షట్‌డౌన్లలో టాప్ దేశాలు**

| దేశం | షట్‌డౌన్లు |
|---|---|
| మయన్మార్ | 85 |
| భారత్ | 84 |
| పాకిస్థాన్ | 21 |
| రష్యా | 19 |
| ఉక్రెయిన్ | 7 |

**భారత్‌లో అత్యధిక షట్‌డౌన్లు**

| రాష్ట్రం | షట్‌డౌన్లు |
|---|---|
| మణిపూర్ | 21 |
| హర్యానా | 12 |
| జమ్ము కశ్మీర్ | 12 |

**2024లో 54 దేశాల్లో మొత్తం షట్ డౌన్లు - 296**

**2023లో 39 దేశాల్లో మొత్తం షట్ డౌన్లు - 283**

## మహాయుతిలో ముదిరిన విభేదాలు

బీజేపీ, షిండే మధ్య పెరుగుతున్న దూరం!

**పొమ్మన లేక పొగ పెడుతున్నారు: షిండే వర్గం**



ముంబై, ఫిబ్రవరి 24(నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలో బీజేపీ నేతృత్వంలోని 'మహాయుతి కూటమి'లో లుకలుకలు తీవ్రమయ్యాయి. బీజేపీ, డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన మధ్య విభేదాలు నెలకొన్నాయన్న చర్చ నడుస్తున్నది. కూటమి నుంచి షిండేను బయటకు పంపే ప్రయత్నం జరుగుతున్నదని సమాచారం. తమను పొమ్మనలేక పొగ బెడుతున్నారని షిండే వర్గం గుర్రుగా ఉన్నట్టు తెలుస్తున్నది. త్వరలో రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో షిండే సొంత జిల్లా థాణేలో పాగా వేసేందుకు బీజేపీ సిద్ధమైంది. ఇందుకోసం రాష్ట్ర అటవీ శాఖ మంత్రి గణేశ్ నాయక్‌ను జిల్లాకు పంపింది. ఆయన థాణేలో జనతా దర్బార్ నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఇది షిండే వర్గానికి రుచించడం లేదు. థాణేలో గణేశ్ నాయక్ ప్రవేశం.. షిండేను కట్టడి చేయడానికేనని భావిస్తున్నారు. ఈ క్రమంలో తాము కూడా నవీ ముంబైలో జనతా దర్బార్ నిర్వహిస్తామని షిండే గ్రూపు నేతలు ప్రకటించారు.

## మూడో వంతు కార్మికుల్లో మానసిక సమస్యలు!

**ఉత్తరకాశీ టన్నెల్‌లో చిక్కుకున్న వారిపై అధ్యయనంలో వెల్లడి**

న్యూఢిల్లీ: ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ టన్నెల్‌లో చిక్కుకుని, 17 రోజుల తర్వాత బయటపడ్డ కార్మికుల మానసిక స్థితిపై ఎయిమ్స్-రిషికేశ్ పరిశోధకుల అధ్యయనంలో కీలక విషయాలు వెల్లడయ్యాయి. రోజులు గడుస్తున్న కొద్దీ మూడోవంతు కార్మికులు దిక్కుతోచని స్థితికి చేరుకున్నారని, చివరికి కార్మికుల్లో నిద్ర సమయం పూర్తిగా తగ్గిపోయిందని నివేదిక తెలిపింది. నిర్మాణంలో ఉన్న ఉత్తరకాశీ టన్నెల్ 2023 నవంబర్ 12న కుప్పకూలింది. సొరంగం లోపల 40 మందికిపైగా కార్మికులు 17 రోజులపాటు చిక్కుకుపోయారు. ఆ బాధితుల్లో తలెత్తిన మానసిక, నిద్ర సమస్యలు, ఇతర విపత్తుల బాధితులతో పోల్చితే భిన్నంగా ఉన్నాయని నిపుణుల బృందం తేల్చింది. వీరి నివేదికలోని అంశాలు 'జర్నల్ స్లీప్ మెడిసిన్'లో ప్రచురితమయ్యాయి. సొరంగంలో చిక్కుకున్న సమయంలో రోజువారీ దినచర్య, ఆందోళన, నిరాశ, నిద్ర.. తదితర అంశాలపై 33 మంది కార్మికులను వైద్య నిపుణులు ఇంటర్వ్యూ చేసి.. ఈ నివేదిక రూపొందించారు. తొలి రోజుల్లో ఆందోళనతోపాటు బయటపడతామనే ఆశ ఉండేదని బాధితులు చెప్పారు. రోజులు గడుస్తున్న కొద్దీ దిక్కుతోచని స్థితికి చేరుకున్నట్టు, నిద్ర కరువైనట్టు తెలిపారు.

## స్టడీ, వర్క్ వీసాలపై కెనడా కొత్త రూల్స్


వీసాల రద్దు అధికారాలు బోర్డర్ అధికారులకు

**భారతీయులపై ప్రభావం**



న్యూఢిల్లీ : కెనడా ప్రభుత్వం వలసదారుల నిబంధనల్లో భారీ మార్పులు తీసుకొచ్చింది. ఇమ్మిగ్రేషన్ అండ్ రెఫ్యూజీ ప్రొటెక్షన్ రెగ్యులేషన్స్ పేరుతో రూపొందించిన ఈ నిబంధనలు జనవరి 31 నుంచి అమల్లోకి వచ్చాయి. వీటి ద్వారా బోర్డర్ అధికారులకు మరిన్ని అధికారాలు లభించాయి. ఎలక్ట్రానిక్ ట్రావెల్ ఆథరైజేషన్స్ (ఈటీఏ), టెంపరరీ రెసిడెంట్ వీసా (టీఆర్‌వీ) వంటి డాక్యుమెంట్లను రద్దు చేసే అధికారం అధికారులకు ఉంటుంది. ఇతర దేశాల నుంచి కెనడాకు విద్య, ఉద్యోగాలు, తాత్కాలిక బస కోసం వెళ్లేవారిపై, మరీ ముఖ్యంగా భారతీయులపై దీని ప్రభావం పడుతుంది. వివిధ కారణాలను చూపించి, ఈటీఏ, టీఆర్‌వీ, వర్క్ పర్మిట్, స్టడీ పర్మిట్లను కెనడా ఇమ్మిగ్రేషన్, బోర్డర్ అధికారులు రద్దు చేయవచ్చు. తప్పుడు సమాచారం ఇవ్వడం, క్రిమినల్ రికార్డు ఉండటం వంటి కారణాలను చూపి రద్దు చేయవచ్చు. నిర్ణీత గడువు ముగిసిన తర్వాత కెనడా నుంచి తిరిగి వెళ్లిపోతానని వీసాదారు సంబంధిత అధికారికి నమ్మకం కలిగే విధంగా చెప్పలేకపోయినా ఆ పర్మిట్‌ను రద్దు చేయవచ్చు. పర్మిట్లు రద్దయితే కెనడా నౌకాశ్రయాల్లోకి ప్రవేశించే అవకాశం ఉండదు.

**మస్క్ కెనడా పౌరసత్వానికి ఎసరు!**



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సన్నిహిత సంబంధాలు.. బిలియనీర్ ఎలాన్ మస్క్ కెనడా పౌరసత్వానికి ఎసరు తెచ్చిపెట్టింది. మస్క్ కెనడా పౌరసత్వాన్ని రద్దు చేయాలని 1.5 లక్షల మంది పార్లమెంటరీ పిటిషన్‌పై సంతకం చేశారు. డొనాల్డ్ ట్రంప్‌నకు సలహాదారు, డోజ్ హెడ్‌గా వ్యవహరిస్తున్న మస్క్.. కెనడా జాతీయ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారంటూ ఫిబ్రవరి 28న హౌస్ ఆఫ్ కామన్స్‌లో పార్లమెంటరీ పిటిషన్ దాఖలైంది. మస్క్ కెనడా పాస్‌పోర్ట్, పౌరసత్వాన్ని వెంటనే రద్దు చేయాలని తమ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడోని పిటిషన్‌లో కోరారు. ఆదివారం రాత్రి నాటికి పిటిషన్‌పై సంతకం చేసిన వారి సంఖ్య 1,57,000కి చేరుకుంది. మస్క్ తల్లి 'మేయి మస్క్' కెనడియన్. తద్వారా ఆయనకు కెనడా పౌరసత్వం కూడా లభించింది. కెనడాపై డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న ధోరణి ఆ దేశస్థుల్ని ఆగ్రహానికి గురిచేస్తున్నది. కెనడా దిగుమతులపై టారిఫ్‌లు పెంచుతానని, అమెరికాలో 51వ రాష్ట్రంగా చేరాలంటూ కెనడాపై ట్రంప్ బెదిరింపులకు దిగటం కెనడియన్లను తీవ్రంగా రెచ్చగొట్టింది.

**అంబేద్కర్ ఫొటో తొలగించి**

## మోదీ ఫొటోనా?

**ఢిల్లీ సర్కార్‌పై ఆప్ గుస్సా**

న్యూఢిల్లీ: ఢిల్లీ సీఎంవో నుంచి అంబేద్కర్, భగత్ సింగ్ ఫొటోలను తొలగించి వాటి స్థానంలో ప్రధాని నరేంద్ర మోదీ ఫొటోను బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) సోమవారం ఆరోపించింది. కాగా, ఈ ఆరోపణలపై ముఖ్యమంత్రి రేఖా గుప్తా స్పందిస్తూ తన అవినీతిని, తప్పులను కప్పిపుచ్చుకునేందుకే ఆప్ ఇటువంటి ఆరోపణలు చేస్తోందని తిప్పికొట్టారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నపుడు తన కార్యాలయంలో ఉన్న అంబేద్కర్, భగత్ సింగ్ ఫొటోలను చూపుతూ ట్వీట్ చేసిన మాజీ ముఖ్యమంత్రి, ఆప్ నాయకురాలు ఆతిశీ ప్రస్తుత సీఎం రేఖా గుప్తా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ, రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ ఫొటోలను కూడా షేర్ చేశారు.

### జమిలి ఎన్నికలు అప్రజాస్వామికం కాదు!

- జేపీసీకి చెప్పిన కేంద్ర న్యాయ శాఖ

న్యూఢిల్లీ: లోక్‌సభ, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలను నిర్వహించడం అప్రజాస్వామికం కాదని, దీనివల్ల సమాఖ్య వ్యవస్థకు ఎటువంటి హాని జరగదని కేంద్ర న్యాయ శాఖ తెలిపింది. 'ఒక దేశం-ఒకేసారి ఎన్నికలు' కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన బిల్లులను సంయుక్త పార్లమెంటరీ సంఘం పరిశీలిస్తున్న సంగతి తెలిసిందే. విశ్వసనీయ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం, ఈ సంఘం సభ్యుల ప్రశ్నలకు ఈ మంత్రిత్వ శాఖలోని లెజిస్లేటివ్ డిపార్ట్‌మెంట్ స్పందించింది.

### 'నియంతల యుగం మళ్లీ రావొచ్చు'

న్యూఢిల్లీ: నియంతల యుగం మళ్లీ రావచ్చని ఐక్య రాజ్య సమితి మానవ హక్కుల మండలి అధిపతి హెచ్చరించారు. అత్యంత ప్రమాదకర ఘటనలను నివారించడానికి అత్యవసర చర్యలు అవసరమని పిలుపునిచ్చారు. మానవ హక్కుల మండలిని ఉద్దేశించి దాని హై కమిషనర్ వోకర్ టర్క్ మాట్లాడుతూ గత శతాబ్దాల్లో కొందరు శక్తివంతులు యథేచ్ఛగా బల ప్రయోగానికి పాల్పడేవారని, ప్రజలపై విచక్షణారహితంగా దాడులు చేసేవారని చెప్పారు. నియంతల హింసలు పునరావృతమయ్యే ప్రమాదం ఉందన్నారు.


**దోమల యాంటెన్నాల సాయంతో**

### విపత్తులను ముందే గుర్తించవచ్చు

న్యూఢిల్లీ: అనునిత్యం మనల్ని కుడుతూ ఎంతో చికాకుపెట్టడంతోపాటు పలు రకాల వ్యాధులను సంక్రమింపజేసే దోమలు ప్రపంచానికి గొప్ప వరం లాంటివట. వాటి శృంగాల (యాంటెన్నాల) సాయంతో భూకంపాలు, సునామీల లాంటి ప్రకృతి విపత్తులను ముందుగానే గుర్తించవచ్చని శాస్త్రవేత్తలు తేల్చారు. వాటిలో ఉండే సాంకేతికత నాయిస్-క్యాన్సిలింగ్ పదార్థాల తయారీకీ ఉపయోగపడుతుందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో కంపనాల సున్నితత్వాన్ని అధ్యయనం చేసేందుకు పర్డ్యూ యూనివర్సిటీ పరిశోధకులు దోమల యాంటెన్నాలను పునఃసృష్టించే పనిలో నిమగ్నమయ్యారు. దోమలకు చెవులు లేకపోయినప్పటికీ శృంగాల సాయంతో ధ్వనులను గుర్తించడం ద్వారా పరిసరాలను గమనించగలుగుతాయని, ఇదే తమను ఈ అధునాతన వైజ్ఞానిక పరిశోధనకు పురిగొల్పిందని వారు తెలిపారు.

## ఈ స్మార్ట్ నోట్‌బుక్ స్పెషల్ గురూ!

- ప్రపంచంలోనే తొలి ఏఐ ఆధారిత పునర్వినియోగ స్మార్ట్ నోట్‌బుక్
- అభివృద్ధి చేసిన హైదరాబాదీ టెకీలు



న్యూయార్క్, ఫిబ్రవరి 24: సాంకేతిక రంగంలో కృత్రిమమేధ (ఏఐ) విప్లవాత్మక మార్పులను తీసుకొస్తున్నది. అరచేతిలో ఇమిడే స్మార్ట్‌ఫోన్, నోట్‌బుక్‌ల అడ్వాన్స్‌డ్ వెర్షన్లు ఏఐ టెక్నాలజీతో కొత్త రూపును సంతరించుకొంటున్నాయి. ఈ క్రమంలో హైదరాబాద్‌కు చెందిన క్వాడ్రిక్ ఐటీ సంస్థ ప్రపంచంలోనే మొట్టమొదటి ఏఐ ఆధారిత పునర్వినియోగ స్మార్ట్ నోట్‌బుక్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. డిజిటల్ స్మార్ట్ నోట్‌బుక్‌ల మాదిరి కాకుండా చేతిలో పుస్తకాన్ని పట్టుకొన్నట్టు ఉండే ఈ ఏఐ నోట్‌బుక్‌ను నీటితో సులభంగా శుభ్రపర్చవచ్చు. ఏకంగా 100 సార్లు వాడుకోవచ్చు. ఈ నోట్‌బుక్‌పై రాసే హ్యాండ్‌రైటెడ్ నోట్స్‌ను డిజిటల్ టెక్ట్స్‌గా మార్చి క్లౌడ్ స్టోరేజీలోనూ భద్రపర్చుకోవచ్చు. ఈ మేరకు నోట్‌బుక్‌ను అభివృద్ధి చేసిన హైదరాబాదీ టెకీలు కేసరి సాయికృష్ణ సాబ్నివీశు, రఘురాం తాతవర్ధి, సుమన్ బాలబొమ్ము పేర్కొన్నారు. తమ డివైజ్‌తో కాగితపు వాడకాన్ని తగ్గించి పర్యావరణానికి మేలు చేయవచ్చని సాయికృష్ణ ఈ సందర్భంగా తెలిపారు. ఈ వినూత్న స్మార్ట్ నోట్‌బుక్, దాని వివరాలను హైదరాబాద్‌లో జరుగనున్న బయోఏషియా-2025 సదస్సులో ప్రదర్శించనున్నారు.



### టాయిలెట్‌లో మొబైల్ వాడకంతో పైల్స్ సమస్యలు

న్యూఢిల్లీ: మొబైల్ ఫోన్ చూస్తూ టాయిలెట్‌లో గంటల తరబడి గడిపేవాళ్లు తీవ్రమైన నొప్పితో కూడిన వ్యాధుల (పైల్స్, ఫిస్టులా) బారినపడతారని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా పైల్స్, ఫిస్టులా కేసులు పెరుగుతున్నాయని, ఇదొక ప్రధాన ఆరోగ్య సమస్యగా మారుతున్నదని ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. నీరు సరిపడా తాగకపోవడం, చిరుతిళ్లు ఎక్కువగా తినడం, టాయిలెట్‌లో ఎక్కువ సేపు గడపడం, శారీరక శ్రమలేని జీవనశైలే ఇందుకు కారణమని తెలిపారు. టాయిలెట్‌లో ఎక్కువ సేపు కూర్చోవడం వల్ల మలద్వారంపై ఒత్తిడి పెరుగుతున్నదని పేర్కొన్నారు.